ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024
5

అల్లూరి సీతారామరాజు

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య ఆధ్వర్యంలో అరడ కోట పంచాయతీ బొంగాడారి వాటర్ పాల్స్ మైదానంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసారు ఈ కార్యక్రమంలో మండలం లోని అధికారులు, స్థానిక ఎస్ఐ రమణ, మండల విద్యాశాఖ అధికారి కొమ్ము కృష్ణమూర్తి, తదితరులు హాజర య్యారు. మ్యూజికల్ డ్యాన్స్, థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వేదికపైకి ఆహ్వానిస్తున్న అధికారి

హాట్ ఎయిర్ బెలూన్‌తో పర్యాటక శోభ

- ఐటిడిఎ పిఒ అభిషేక్ చొరవతో ఏర్పాటు - విహరిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో అందుబాటులోకి వచ్చిన హాట్ హెయిర్ బెలూన్స్ పర్యాటకులను స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇంతవరకు ఇతర దేశాల్లోనే పరిమితమైన హాట్ ఎయిర్ బెలూన్స్ ఇప్పుడు అరకులోయ పర్యాటక కేంద్రానికి పరిచయం అవడంతో పర్యాటకులు స్థానికులు సంబరపడి పోతున్నారు.

గతంలో అరకులోయలో నిర్వహించిన హాట్ హెయిర్ బెలూన్స్ ఫెస్టివల్ ఉండడంతో అనేకమంది వాటిలో ఎక్కే అవకాశం లేక పోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో పర్యాటకులను మరింత ఆకట్టుకోవడంలో భాగంగా ఐటిడిఎస్ సంకల్పించి హార్ట్ ఎయిర్ బెలూన్ల నిర్వాహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాంత వాసులకు పర్యాటకుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. హెలికాప్టర్లో, విమానాల్లో ఎక్కినంత గా తీవ్ర అనుభూతిలోనవుతున్నారు. గత దసరాకు ట్రైలర్ నిర్వహించి ఇటీవల ప్రారంభించిన హాట్ ఎయిర్ బెలూన్ విశేషంగా ఆకట్టుకుంటుంది. పర్యాటకుల, స్థానికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది.

హాట్ బెలూన్ ఎగుర వేయడానికి ప్రముఖ పర్యాటక సందర్శిత ప్రాంతమైన అరకులోయ సమీపంలోని పద్మావతి ఉద్యానవన కేంద్రంలో సుమారు మూడున్నర ఎకరాల్లో హాట్ బెలూన్ కోసం స్థలమును కేటాయించింది. హాట్ బెలూన్‌లో విహరించే పర్యాటకులు ఒక్కొక్కరు రూ.1500 రూపాయలు టికెట్ ధర చెల్లించవలసి ఉంటుంది. అరకు ప్రకృతి అందాలను వీక్షించేందుకు హాట్ బెలూన్ పై ఎక్కి పర్యాటకులు తమ కెమెరాలో బంధించేందుకు ఎగ బడుతున్నారు.గాలిలో ఎగిరే ఈ హాట్ బెలూన్లో విహరిస్తుంటే తీవ్ర అనుభూతి కలుగుతుందని పర్యాటకులు అభిప్రాయ పడుతున్నారు. హాట్ బెలూన్ ఇటీవల ప్రారంభించడంతో అరకులోయకు సరికొత్త అందం రూపుదిద్దుకుందని ఈ ప్రాంత వాసులు తమ అభిప్రాయాలను వెల్లుబుచ్చుతున్నారు.

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవతో అరకులోయకు హాట్ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 250 నుంచి 300 అడుగుల వరకు పైకి గాలిలో విహరించిన తర్వాత కిందకు దిగుతుందని ఇటీవల పాడేరు ఐటిడిఎ పివో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో అరకులోయ అందాలను ఆహ్లాదకర మైన వాతావరణమును, పచ్చటి ప్రకృతిని దృశ్యాలను, మంచు అందాలను కెమెరాలకు బంధించి తీవ్ర అనుభూతి పొందవచ్చని హాట్ బెలూన్ ఎక్కిన పర్యాటకులు స్థానికులు అంటున్నారు.

హాట్ ఎయిర్ బెలూన్

మన్యం గజగజ!

- ఏజెన్సీవాసులను వణికిస్తున్న చలిపులి!
- గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- అవస్థలు పడుతున్న గిరిజనం
- చలిమంటలతో ఉపశమనం

చింతపల్లి క్యాంపులో చలిమంట కాగుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం మంచు అధికంగా కురవడంతో చలితీవ్రత మరింత పెరిగింది. అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా మబ్బులతో కూడిన వాతావరణం ఉండడంతో చలితీవ్రత కొంచం తగ్గినప్పటికీ, ఆదివారం ఒక్కసారిగా మబ్బులు వెలియడంతో చలి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు గురయ్యారు. సాయంత్రం ఐదు గంటల నుంచి చల్లటి చిరుగాలులు వీస్తూ, రాత్రికి అధికమై చలి తీవ్రత పెరగడంతో మన్యవాసులు గజగజ లాడిపోతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు సూర్యుడు ఉదయించినప్పటికీ చలి మాత్రం తగ్గుముఖం పట్టలేదు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఉన్ని దుస్తులు ధరించి ఉపశమనం పొందుతున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామ గిరిజనులు చలి తీవ్రతకు తట్టుకోలేక, వెచ్చదనం కోసం పగలు కూడా చలిమంటలు వేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. సాయంత్రం 6 గంటల నుంచి చలిమంటలు వేసుకుంటూ మంటలు సమీపంలో గిరిజనులు నిద్రిస్తున్నారు. మంచాల కింద అగ్గికుంపట్లు పెట్టుకుని వెచ్చదనం ఆస్వాదిస్తున్నారు.

ఇటీవల అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సీలేరు ప్రాంతంలో అడపాదడపా వర్షాలు కురవడంతో మంచు తీవ్రత అధికమై, గాలిలో తేమ శాతం గణనీయంగా పెరిగి గిరిజనాన్ని గజగజలాడిస్తోంది. చలి తీవ్రతకు భయపడి, గిరిజనులు, పొలాలకు, వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూడా వెనకడుగు వేసే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలతోపాటు ఇతర వ్యవసాయ పనులలో గిరిజనులు నిమగ్నమై ఉన్నారు. ఉదయానికే వరి, అపరాల పంటల పనులకు వెళ్లాల్సిన దారకొండ,దుప్పిలివాడ, గుమ్మిరేవులు, గాలికొండ పంచాయతీ పరిధిలోని గిరిజనులు మంచు అధికంగా కురుస్తూ, ప్రతికూల వాతావరణం ఉండడంతో ఎనిమిది గంటలు దాటితేగానీ ఇళ్లల్లోంచి బయటకు రావడం లేదు.. సీలేరు నుంచి వయా దారకొండ చింతపల్లి మీదగా మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనదారులు మంచు అధికంగా ఉండడంతో రహదారి కనిపించక నానా అవస్థలు గురవుతున్నారు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో ఇబ్బందులు పడుతున్న మన్యవాసులు, రానున్న రోజుల్లో మంచు, చలి తీవ్రత ఇంకెంత ఎక్కువగా ఉంటుందోనని భయాందోళన చెందుతున్నారు.

సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ పింపలగూడ గ్రామంలో ఆదివారం మమత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి పంచాయతి పరిధి గిరిజనులు, కోరాయి పంచాయతీ గ్రామ ప్రజలు సుమారు 300 మందికి వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 22 మందికి కళ్ళద్దాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని మమత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మమత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద గిరిజనులందరూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఇలాంటి వైద్య సేవ కార్యక్రమాలు మరెన్నో మారుమూల గిరిజన ప్రాంతంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్,బ ఏం లచ్చు, గేమేలి పురుషోత్తం, కిల్లో మహేష్, కొర్ర పురుషోత్తం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన

- 37వ రోజుకు గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్ల దీక్షలు

ప్రజాశక్తి- రంపచోడవరం : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు గాంధేయమార్గంలో శాంతియుతంగా దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం అధికారులు స్పందించకపోవడం బాధాకరమని గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఐటిడిఎ వద్ద రిలేదీక్షలు 37వ రోజుకు చేరిన సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా గిరిజన గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనంత కుమారిమాట్లాడుతూ తాము గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, తమపట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, 1659 గిరిజన గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. తమ దీక్షలకు యుటిఎఫ్‌తోపాటు సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయన్నారు. కార్యక్రమంలో గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణ రెడ్డి, పాపయమ్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రజల పత్రిక ప్రజాశక్తి

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకు లోయ : ప్రజాశక్తి దినపత్రిక ప్రతి ఏడాది ప్రచురిస్తున్న మల్టీకలర్ క్యాలెండర్ అద్భుతంగా ఉందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన 2025 క్యాలెండర్‌తో పాటు, డైరీలను ఆదివారం ఉదయం తన గృహములోని తన కార్యాలయం ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాశక్తి దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతును వినిపిస్తుందని అన్నారు. ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెంది ప్రజా సమస్యలను వెలుగు తీసికొచ్చి వాటి పరిష్కారం దిశగా మార్గదర్శి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గెడ్డం నరసింగరావు, అరకు వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షులు పాంగి నరసింగరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగం చాణక్య, సెగని నాగరాజు, రామారావు పాల్గొన్నారు.

సెలవు రోజున విఒఎల నిరసన

మూడో రోజూ యానిమేటర్ల దీక్షలు

ఐటిడిఎ ఎదుట నిరసన తెలుపుతున్న వెలుగు యానిమేటర్లు

ప్రజాశక్తి రంపచోడవరం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెలుగు యానిమేటర్లు రంపచోడవరం ఐటిడిఎ ఎదుట చేపడుతున్న రిలేదీక్షలు ఆదివారం మూడవ రోజున కొనసాగాయి.ఆదివారం సెలవు రోజు కావడంతో ఐటిడిఎ అధికారులు, సిబ్బంది ఎవరూ కార్యాలయానికి రాకపోయినప్పటికీ, వెలుగు యానిమేటర్లు దీక్ష శిబిరంలో కూర్చొని తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నాటి దీక్షా శిబిరంలో 58 మంది విఒఎలు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు ఐవికి పితృవియోగం

నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఇతర నేతలు

ప్రజాశక్తి -ఎటపాక : సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యుడు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి తండ్రి ఇసంపల్లి రాములు (80) ఆదివారం ఉదయం మరణించారు.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తనువు చాలించారు.. ఇసంపల్లి రాములకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు ఐవి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడిగా ఉన్నారు. కాగా ఇసంపల్లి రాములు భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఇసంపల్లి రాములు మృతదేహంపై పూలమాల వేసి నివాళు లర్పించిన వారిలో మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబూరావు, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు ఎంబి.నర్సారెడ్డి, గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, ఎటపాక మండల కార్యదర్శి కాకా అర్జున్, నాయకులు దేగల మాధవరావు, గంపల హరనాథ్, ఆకిశెట్టి రామున్నారు.

పీసా గ్రామ సభలు నిర్వహించాలి

24న దినోత్సవ వేడుకలు
డిఎల్‌పిఒ ఎ.ఎస్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో గిరిజన పంచాయితీలలో ఈ నెల 24న పీసా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పాడేరు డివిజనల్ గ్రామపంచాయతీ అధికారి పీఎస్ కుమార్ వెల్లడించారు. ఈ వేడుకల నిర్వహణ కోసం ప్రతి పంచాయతీకి రూ.10000 చొప్పున నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసించే ప్రజల కోసం సాంప్రదాయ గ్రామసభల ద్వారా స్వయం పాలనను నిర్ధారించడానికి వీలుగా రాజ్యాంగంలోని నిబంధనలను కొన్ని మినహాయింపులు, సవరణలతో భారత ప్రభుత్వం రూపొందించిన "షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయితీ విస్తరణ (పీసా) చట్టం 1996వ సంవత్సరం డిసెంబర్ 24 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 24న షెడ్యూలు ప్రాంత పంచాయతీలలో " పెసా దినోత్సవ వేడుకలు" నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ పీసా వేడుకల నిమిత్తం ప్రతీ గ్రామపంచాయతీకు పదివేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విస్తరణాధి కారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ సూచనల మేరకు పీసా దినోత్సవ వేడుకలు, ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ వేడుకలలో పెసా చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు , షెడ్యూలు ప్రాంతాలలో గ్రామసభలను బలోపేతం చేయడం, అటవీ ఉత్పత్తులు సేకరణ ఖనిజ సంపద, రుణాలపై నియంత్రణ, భూ బదలాయింపు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై చర్చించాలన్నారు. అటవీ, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, న్యాయశాఖ తదితర శాఖల సిబ్బంది హాజరు కావాలని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీలలో 24న విధిగా పెసా వేడుకలు నిర్వహించాలని చెప్పారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పెదబయలు : పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు బొండా సన్నీబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ విషయంలో ప్రధానమంత్రి అమిత్ షాను వెనకేసుకు రావడం చాలా దుర్మార్గమన్నారు. అంబేద్కర్‌ని అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానిం చడమేనన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని అణగదొక్కి మనుధర్మ సిద్ధాంతాన్ని తీసుకురాడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను భారత ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సన్నిబాబు

గణిత మేధావి రామానుజన్‌కు ఘననివాళి

రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి- చింతూరు :: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర విభాగాధిపతి కె.శ్రీలక్ష్మి అధ్యక్షతన రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ మాట్లాడుతూ పిన్న వయస్సులోనే రామానుజన్ ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీలో సభ్యుడిగా సేవలు అందించి ప్రపంచ గణిత మేధావిగా గుర్తింపు పొందారని, 33ఏళ్ల జీవితంలో గణిత శాస్త్రంలో అనేక ఆసక్తికరమైన అంశాలను ఆవిష్కరించరాన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ రామానుజన్ కనుగొన్న వాటిలో ముఖ్యంగా మాక్ తీటా ఫంక్షన్స్, అనలిటికల్ జామెంట్రీ, పార్టీ సియాన్ ఆఫ్ నంబర్స్, త్రికోణమితి ఆయిలర్ ఫార్ములా,మ్యాజిక్ స్క్వేర్ ఆధారంగా వచ్చిన 'స్ట్రింగ్ థియరీ నేడు కేన్సర్ వ్యాధి పరిశోధనలకు ఉపయోగపడుతుందన్నారు అతిచిన్న వయస్సులో లండన్ యూనివర్సిటీలో పిహెచ్‌డి అవార్డు పొందిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకటరావు, ఆర్.సిహెచ్. నాగేశ్వరరావు, యస్.అప్పనమ్మ, బి.శ్రీనివాసరావు, కె.శైలజ, డాక్టర్.వై.పద్మ, జి.హారతి, కె.శ్రీదేవి, కె.శకుంతల, జి.సాయికుమార్, యన్.రమేష్, అధ్యాపకేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక గురుకుల పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతి నిర్వహించారు. .రాయల్ సొసైటీ ఆఫ్ లండన్‌కు ఎంపికైన మొదట భారతీయుడిగా రామానుజన్ ప్రతిభను కొనియాడారు. విద్యార్థులకు గణితంలో వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

కొయ్యూరు : కొయ్యూరు బాలురు ఆశ్రమ పాఠశాల-2లో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలమురళీకృష్ణ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో గురుకుల విద్యార్థులకు బహుమతులు

పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి

ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల: సంక్రాంతి పండుగ కానుకగా విశాఖ డెయిరీ రైతులకు బోనస్ అందిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తులసి కళ్యాణ మండపం వద్ద 2025 సంక్రాంతి పండగ సందర్భంగా బోనస్ నగదు చెక్కులను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, డైరెక్టర్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో శాసనసభ్యులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, విశాఖ డైరీ వ్యవస్థాపకులు ఆడారి తులసిరావు ఎప్పుడు రైతులు మేలు కోసం ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేశారని కొనియాడారు. రైతుల సంక్షేమమే డెయిరీ లక్ష్యంగా ముందుకు నడిపారన్నారు. ఆయన బాటలోనే ఆనంద్ కుమార్, రమాకుమారి డైరెక్టర్లు పనిచేస్తున్నారని అన్నారు. డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రైతులకు 2025కి సంబంధించి రెండు బోనస్ లు ఇస్తున్నామన్నారు. ఉగాది నాటికి మరో బోనస్ ఇచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. డెయిరీలో వస్తున్న లాభాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సీరం రెడ్డి సూర్యనారాయణ, గేదెల సత్యనారాయణ, సుందరపు గంగాధర్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ సూర్యారావు, డైరీ జనరల్ మేనేజర్ కుమార్, డిప్యూటీ మేనేజర్ పి పాండ్యా రాజన్, మేనేజర్ జి రాము, స్థానిక విశాఖ డైరీ అధ్యక్షులు పాము శీను, వేతన కార్యదర్శి గండి జోగి నాయుడు, పాలకవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

నాగజ్యోతికి బంగారు పతకాలు

ప్రజాశక్తి- రోలుగుంట: వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణా ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో ఫుల్ పవర్ లిఫ్టింగ్, డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాలు జరిగాయి. ఈ పోటీల్లో రోలుగుంట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు పీవీఎం.నాగజ్యోతి ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ఈ మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలకు 200 మంది క్రీడాకారులు సుమారు ఎనిమిది రాష్ట్రాల నుంచి హాజరు అయ్యారు. మూడు బంగారు పతకాలు సాధించిన నాగజ్యోతిని పలువురు అభినందనలు తెలియజేశారు.

యోగా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు ఇంటర్ యూనివర్శిటీ యోగా మహిళలు జట్టు ఎంపిక, ఆంధ్రాయూనివర్శిటీ పురుషులు, మహిళలు యోగా జట్లు ఎంపిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయు దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, ఆల్ ఇండియా యూనివర్శిటీ యోగా పోటీలు భువనేశ్వర్‌లో కిట్స్ యూనివర్శిటీలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆచార్య ఎన్.విజయమోహన్, ఎయు వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించి యోగాలో ప్రతిభ సాధించి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాన్నారు. యోగా కోచ్ వర్మ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రతీ ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తాము ఆనాడు చదువుకునే రోజులు, చేసే అల్లరి, వారితో కలిసి ఆడిన ఆటలు ..అవన్నీ ఒక మధురమైన క్షణాలు. మళ్ళీ అవన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల వేదికగా ఆదివారం వీరంతా కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఒకరు నొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వీరంతా ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం వీరంతా కలిసి పోవడంతో ఆనందం వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేవీ సత్యనారాయణ, బొల్లం కోటేశ్వరరావు, డి రమణ, రామారావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, సత్యానంద్, రెడ్డి త్రినాధరావు, జ్యోతి, భారతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆలయానికి రూ.15 వేలు విరాళం

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలో మండలంలోని ఎం కోడూరు మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి కీర్తిశేషులు రేణం. త్రిమూర్తులు, రమణమ్మ దంపతుల కుమారుడు శేషగిరి లక్ష్మి కుమారులు మోక్షత్ పవిత్రలు రూ. 15 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆదివారం ఆలయం వద్ద అందజేశారు. ఈ నగదును ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, జల్లి హరిప్రసాద్, సిరా అప్పలనాయుడు, లింగంపల్లి సతీష్, గెంజి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అనంతగిరి: గ్రామ వాలంటీర్లకు రెగ్యులర్‌తో పాటు 10 వేలు వేతనాలు చెలిస్తామని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని గ్రామ వాలంటీర్లు ఈ నెల 26 నండి 28 వరకు చేపట్టే ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమమహేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో పి. మంజుల అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు పూర్తి అయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తుందని తెలిపారు. ఇక పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 10 వేల రూపాయలు గౌరవ వేతనం పెంచుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఇప్పుడు కూటమి నాయకులు వాలంటీర్లపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇందుకు నిరశనగా వాలంటిర్లు ఈ నెల 26,27,28 తేదీల్లో మండల కేంద్రంలో తల పెట్టిన రిలే నిరాహార దీక్షలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటింస్తుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో .మోస్య, సాగర. సుమిత్ర, చిలకమ్మ, వాలంటీర్లు స్వాబి అప్పలరాజు, పొట్టంగి సన్యాసిరావు సాగరా. చిన్నరావు రైల్వే యూనియన్ నాయకులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకులోయ : మన్య ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పనకు తన వంతు కృషి చేస్తున్నట్లు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆదివారం తన నివాసంలో ప్రజాశక్తి 2025 క్యాలెండర్, డైరీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో కొద్దిసేపు మాట్లాడారు. మారుమూల కొన్ని గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యానికి నోచుకోలేదన్నారు. దీంతో డోలి మోతే శరణ్యమైందన్నారు. రహదారి సౌకర్యం కల్పిస్తే అభివృద్ధికి బీజం పడుతుందన్నారు. అదేవిధంగా విద్య, వైద్యం వంటి సదుపాయాలతో పాటు, రైతులకు సాగునీరు అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. తద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పర్యాటక శాఖ కొన్ని ప్రదేశాలను ఎంచుకొని కృత్రిమ అందాలు క్రియేట్ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపార దోపిడీ నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు. అధిక రేట్లు పెట్టి స్థానిక ప్రజలపై తీరని భారం మోపుతున్నారని ఆయన స్పష్టం చేశారు. లాడ్జిల్లో, హోటల్స్‌లో రేట్లు నియంత్రించాలన్నారు. పర్యాటక సీజన్లో వ్యాపారులు పెంచిన రేట్లు అది నిరంతరం గిరిజనులపై భారం ఉండిపోతుందన్నారు. వ్యాపారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయించకుండా చూడాలన్నారు.కూటమి ప్రభుత్వ హాయంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం హాయంలో నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అధికారుల సహకారంతో అభివృద్ధికి నిర్విరామంగా తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షించడానికి తాను నిరంతర ముందుంటానని చేశారు.

మత్తుతో జీవితం చిత్తు

ప్రజాశక్తి-విశాఖపట్నం : మత్తు పదార్థాలకు బానిసైతే యువత జీవితం నాశనం అవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ అన్నారు. మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఆదివారం శాతవాహన హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకంలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. ఉన్నత ఆశయాలతో విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని కోరారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలకు బానిసలుగా మారకూడదని హితవు పలికారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, భవిష్యత్తు నాశనం అవుతాయని గుర్తించాలన్నారు. విద్యావంతులైన యువత దేశానికి ఉపయుక్తంగా నిలిచే ఉన్నత మానవ వనరులుగా మారాలని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన బ్యానర్లను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని విద్యార్థులకు వివరించారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధి శ్రీరామ్ ప్రాపర్టీలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నేర విభాగపు ఏసిపి వెంకటరావు తెలిపారు. పిఎం.పాలెం స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పనోరమ హిల్స్ శ్రీరామ్ ప్రాపర్టీలో చోరీ జరిగింది. ఫిర్యాదుదారులు కసిరెడ్డి వెంకట సీతా మహాలక్ష్మి సంధ్యా దేవి భర్త కొప్పర్తి వెంకటేశ్వరరావు ఆర్కిడ్స్ 43 ఎ పనోరమా హిల్స్, శ్రీరామ్ ప్రాపర్టీస్‌లో నివాసముంటున్నారు. కెజిహెచ్‌లో డాక్టర్లుగా పని చేస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఆగస్టు 8వ తేదీ మధ్యాహ్నం భీమవరం వెళ్లారు. తిరిగి 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో గల సుమారు 1040 గ్రాములు కలిగిన బంగారం వస్తువులు, నగదు రూ.20 లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పిఎం పాలెం నేరవిభాగపు సిఐ ప్రకాష్ ఆధ్వర్యాన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెలిముద్రలు ఆధారంగా మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లా టార్సింగ్ గ్రామానికి చెందిన కుందన్, సురేష్‌లతో పాటు మరి కొందరిని పోలీసులు గుర్తించారు. ఎ2గా ఉన్న సురేష్‌ను పిఎం.పాలెం లాకాలేజీ రోడ్డులో పట్టుకున్నారు. అతడి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. మిగిలిన బంగారం, నగదును తొందరలోనే రికవరీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కేసును ఛేధించిన ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు, ఎం బాలరాజు, హసీనా బేగం, గణేష్, ఎల్.రమేష్, జె.నాగరాజు, ఎమ్‌డి అయ్యుబ్, జెఎం.మల్లిక్, సంతోష్, పి.రవినాయక్ తదితర సిబ్బందిని అభినందించారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన...

దంపతులపై కేసు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వివిధ పండుగలు సందర్భంగా చిట్టీల పేరుతో రూ.47.40 లక్షలు వసూలు చేసి మోసం చేశారన్న బాధితుల ఫిర్యాదు మేరకు జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మివానిపేటకు చెందిన దంపతులు సరగడ పార్వతి, లక్ష్మణపై స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సిఐ సుధాకర్ కథనం ప్రకారం.. నమ్మివానిపేటకు చెందిన భార్యాభర్తలు పార్వతి, లక్ష్మణ కలిసి వలంధపేటలో దసరా తదితర పండుగలు సందర్భంగా చిట్టీల పేరుతో రూ 47.40 లక్షలు వసూలు చేశారు. 2020 నుంచి ఇదే తరహాలో చిట్టీలు వేస్తున్నారు. చిట్టీలు కట్టిన వారికి 2022 నుంచి చెల్లింపులు చేయలేదు. దీంతో వలందపేటకు చెందిన బాధితురాలు కొసన అప్పలకొండ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దంపతులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అనకాపల్లి పట్టణ ఎస్.ఐ ఈశ్వరరావు తెలిపారు నక్కపల్లి మండలం పాటిమీద గ్రామానికి పెంటకోట నానిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశామన్నారు.

విద్యార్థుల కళా ప్రతిభ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో నగరవాసుల మనసులను దోచుకుంటున్నారు. ఫైన్ ఆర్ట్స్ విభాగ విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనకు కళాభిమానుల నుంచి, నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభతో తయారుచేసిన చిత్రాలను ప్రదర్శించడంతోపాటు వాటి విక్రయాలను సైతం ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన కళాఖండాలను నగరవాసులు ఎంతో ముచ్చటపడి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన కళారూపాలు తక్కువ ధరకే ఇక్కడ లభిస్తుండడంతో శని ఆదివారాల్లో విక్రయాలు గణనీయంగా జరిగాయి. దీంతో విద్యార్థులు మరికొన్ని చిత్రాలను, శిల్పాలను తయారుచేసే పనిలో నిమగ్నం అవుతున్నారు. విద్యార్థులు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన లభిస్తోంది. ఇంటిలో అలంకరణకు, బహుమతులుగా ఇవ్వడానికి ఇక్కడ విద్యార్థులు చేసిన కళాఖండాలు, వర్ణ చిత్రాలు ఎంతో అనువుగా ఉంటున్నాయి. ఈనెల 29 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7:00 వరకు శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఈ ప్రదర్శన ఉంటుంది. విద్యార్థుల ప్రతిభకు నగరవాసుల నుంచి వస్తున్న ఆదరణ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని విభాగాధిపతి డి.సింహాచలం అన్నారు

వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో వీధికుక్కలు గుంపులుగా, విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు సీలేరు పురవీధుల్లో గుంపులుగా వీధికుక్కలు తిరుగుతుండడం, వీధుల్లో ఎక్కడికక్కడే రహదారిపైనే తిష్టవేసి ఉండడంతో ఎవరిపై దాడి చేసి గాయపరుస్తాయేమోనని భీతిల్లుతున్నారు. ముఖ్యంగా వీధుల్లోకి వెళ్లే చిన్నపిల్లలను కరిచే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన గురవుతున్నారు. పాఠశాలలకు ఒంటరిగా పంపేందుకు భయపడుతున్నారు. సీలేరు సచివాలయం పరిసర ప్రాంతాల్లో వీధికుక్కలు తిష్టవేసి ఉండడంతో సచివాలయ ఉద్యోగులు భయపడుతుండగా, సచివాయానికి పనులపై వెళ్లేందుకు సైతం అక్కడికి వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటే కుక్కల బెడదతో భయపడుతుండగా, కుక్కలు గుంపులుగా ఉన్న ప్రాంతం వైపు ఒంటరిగా వెళ్లేందుకు పురుషులు సైతం జంకుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వీధికుక్కలు సంతానోత్పత్తికి పరుగులెడుతున్న పరిస్థితుల్లో అటుగా వెళితే కాలి పిక్క పట్టుకుంటాయోమోనన్న భయం ప్రజల్లో ఉంది. ఇక కుక్క పిల్లలు కూడా ఎక్కడికక్కడే అధికంగా కనిపిస్తున్నాయి. సీలేరులో వీధి కుక్కల సంచారాన్ని నియంత్రించేందుకు పంచాయతీ పరంగా సర్పంచ్ దుర్జో, ఇతర అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో తప్పిన ఘోర ప్రమాదం

- విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లిన ఇంజిన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. కొంతమంది ప్రయాణికుల కథనం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో మూడో నెంబర్ ఫ్లాట్ ఫారానికి చేరుకున్న 22606 పురులియ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఇంజిన్ మారుస్తున్నారు. ఆ సమయంలో ఇంజిన్‌కు అనుకోకుండా విద్యుత్ తీగలు తగిలాయి. వాటిని ఇంజిన్ సుమారు 100 నుంచి 150 మీటర్లు లాక్కుని వెళ్లింది. దీనిని గుర్తించిన సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఈ ప్రమాదంలో రైలు ఇంజిన్‌కు మాత్రమే విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి రైళ్లను పునరుద్ధరించారు. ఉదయం 5:40 గంటలకు విశాఖపట్నం చేరుకున్న 22606 పురులియా ఎక్స్‌ప్రెస్ 6 గంటలకు విశాఖ నుంచి బయలుదేరాల్సి ఉండగా 9:17 గంటలకు ప్లాట్ ఫారం 3 నుండి బయలుదేరింది.

అలాంటిదేమీ లేదు : రైల్వే అధికారులు

సంఘటనపై అధికారులను వివరణ కోరగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా మూడో నెంబర్ ఫ్లాట్ ఫారం వైర్‌ను మార్చామని రైల్వే అధికారులు తెలిపారు. అంతే తప్ప ప్రమాదమేమీ లేదని, అన్ని రైళ్ల రాకపోకలు యధావిధిగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. మూడో నెంబర్ ప్లాట్ ఫారం దక్షిణ దిశలో జరుగుతున్న మరమ్మతుల పనుల సమయంలో రైళ్ల రాకపోకల వ్యవస్థకు ఒక గంట సేపు అంతరాయం కలిగిందని తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

- నినదించిన సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభ
- పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం
- జిల్లా సమగ్రాభివృద్ధి, స్థానిక సమస్యలపై పోరాటాలకు నేతల పిలుపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి

సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభ ఆదివారం సమరోత్సాహంతో ముగిసింది. రెండు రోజులపాటు నర్సీపట్నంలో జరిగిన ఈ మహాసభలో జిల్లాలోని కీలక సమస్యలపైనా, ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపైనా చర్చించారు. జాతీయ, రాష్ట్ర పరిస్థితులను నాయకులు మహాసభ వేదికగా వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభ 22 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది.

శనివారం ర్యాలీ, బహిరంగ సభతో ప్రారంభమైన ఈ మహాసభ ఆద్యంతం ఉత్తేజభరితంగా సాగింది. ఆదివారం ఉదయం పార్టీ జెండాను సీనియర్ నాయకులు త్రిమూర్తులు రెడ్డి అవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, తదితరులు పూలు వేసి నివాళులర్పించారు. ఎ.బాలకృష్ణ నగర్, సత్తిబాబు ప్రాంగణం, మళ్ల సత్యనారాయణ వేదికగా జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపైనా, మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రవేశపెట్టిన నివేదికను మహాసభ ఆమోదించింది.

ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు

ప్రజా సమస్యలపై వామపక్షాలు ఐక్య కార్యాచరణతో ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలను అమలు చేయాలన్నారు. సిపిఎం 24వ మహాసభలో ఆయన సౌహార్ధ సందేశమిస్తూ పాలక, ప్రతిపక్షాలు మోడీకి భయపడి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సమర్ధిస్తున్నాయని అన్నారు. ప్రత్యామ్నాయ శక్తిగా వామపక్షాలు ఎదిగేలా పోరాటాలు కొనసాగించాలన్నారు.

సీనియర్లకు సన్మానం

సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, త్రిమూర్తులు రెడ్డి, కెవి.సూర్య ప్రభ, జి.నాయినిబాబు, ఎల్.గౌరి, సదాశివ, సాంబశివరావు, నాగిరెడ్డి సత్యనారాయణలను మహాసభలో సత్కరించి గౌరవించారు.

నూతన జిల్లా కమిటీతో రాష్ట్ర నాయకులు

22 తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తగిన నిధులు కేటాయించి ఖర్చు చేయాలని పేర్కొంది. తొలుత పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై అమరులకు మహాసభ ఘన నివాళులర్పించింది. జిల్లా సమగ్రాభివృద్ధిపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బి.ప్రభావతి బలపర్చారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని ప్రధాన అంశాలకు సంబంధించి ప్రవేశపెట్టిన 22 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపింది.

1.జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి
2.పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలి. కార్మికులకు భద్రత కల్పించాలి.
3.నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి. మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలి
4.జిల్లాలో ఎస్ఇజెడ్, పరిశ్రమల కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలి.
5.విశాఖ ఉక్కును కాపాడుకోవాలి.
6.గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలి. రోజు కూలి రూ.600 ఇవ్వాలి. ఏడాదికి 200 రోజులు పని కల్పించాలి
7.మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు నివారించాలి. మహిళా రక్షణ చట్టాలను అమలు చేయాలి.
8. మూడు సహకార షుగర్ ఫ్యాక్టరీలు పునరుద్ధరించాలి.
9. కాలుష్యాన్ని నియంత్రించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి.
10.నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి.
11. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
12.ఎస్ఇజెడ్‌లో కార్మిక చట్టాలు అమలు చేయాలి.
13. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలి.
14.డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలి
15. చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి.
16.సాగు ఆధారంగా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
17.పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి. ఖాళీ పోస్టులు భర్తీచేయాలి.
18.ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయాలి. సాగునీటి వనరులను మెరుగుపర్చాలి.
19. ఇసుక ఉచితంగా ఇవ్వాలి.
20.పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. బోనస్ ఇవ్వాలి
21.జీడి, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి
22.విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి.

21 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

21 మందితో సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.లోకనాథం, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, జి.శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులుగా బి.ప్రభావతి, ఆర్.రాము, కె.గోవిందరావు, వివి.శ్రీనివాసరావు, జి.దేముడు నాయుడు, అడిగర్ల రాజు, అల్లు రాజు, ఎం.రాజేష్, బిటి.దొర, ఎం.సత్యన్నారాయణ, డిడి.వరలక్ష్మి, గూనూరు వరలక్ష్మి, ఇ.నరసింహమూర్తి, బి.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఒక చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చోడవరం : 1988-89లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం స్థానిక వి.కన్వెన్షన్‌లో ఒక్కచోట కలుసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలో వీరంతా ప్రస్తుతం ఉంటున్నారు. 'ఒరే చోడవరం' పేరుతో పదేళ్ల నుంచి వీరిలా ఒకచోట కలుసుకుని సందడిగా గడుపుతున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయతలను కలబోసుకుంటున్నారు. కార్యక్రమంలో కె.బ్రహ్మాజీ, పి.రామకృష్ణ, జగదీష్, సుబ్రమణ్యశాస్త్రి, కిషోర్, జె.నానాజీ, జె.సాయిబాబా, సురేష్, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్రంలో అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం మద్దిలపాలెం డిపోలో ఆయన ఒక సూపర్ లగ్జరీ, 3 ఎక్స్ ప్రెస్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బస్సులను విశాఖపట్నం నుంచి పాడేరు, విజయనగరం, అమలాపురం మార్గాలలో ప్రయాణికుల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వానికి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు వంటివారన్నారు. కార్మికుల ఇబ్బందులు తీర్చడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సుల ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా మహిళలకు ఉచిత బస్సు వాగ్దానం నెరవేరేలా తొందరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గడిచిన సంవత్సర కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర, డిస్టిక్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆదినారాయణ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ్ కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు

డ్రైవర్ల విభాగంలో శేఖర్, కెకెహెచ్.ప్రసాద్, ఆర్ఎ.నాయుడు, యుఎస్.చలం, ఎస్‌కెఎన్.రావు, ఇ.రమేష్‌లు ఉత్తమ పురస్కారాలకు ఎంపిక కాగా, ఉత్తమ కండక్టర్ల విభాగంలో జిజి.మూర్తి, కెఎన్.రాజు, ఎంజి.రావు, ఎం.రాజు, ఒఎస్ఆర్.రాజు, పిఎస్‌బి.రావు, పి.నగేష్ ఎంపికయ్యారు.

150 మందికి ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యాశాల అధ్వర్యంలో మండలంలోని సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 150మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు దాసరి ఉమ మహేష్, రాయుడు శ్రీనివాస్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 37మందికి రక్తపరీక్షలు, ఇద్దరికి, థైరాయిడ్ పరీక్షలు, ఐదుగురికి ఫిజియోథెరపీలు, ముగ్గురికి ఇసిజి లు, 9మందికి ఎక్స్‌రేలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు బోజన సదుపాయం కల్పించినట్లు స్వామీజీ తెలిపారు.